

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
19 వ వసంతంలోకి ...

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
పోలవరం(రంపచోడవరం)జిల్లా

బుధవారం,4 మార్చి 2026 | 8 పేజీలు

# జిల్లాలో పారిశుద్ధ్య 'గర్జన'..

## జాయింట్ కలెక్టర్ స్వీయ పర్యవేక్షణ!





- జిల్లావ్యాప్తంగా 'ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్' నిర్వహణ
- కాలువ గట్టు వెంట మట్టి దిబ్బలు, చెత్త తొలగింపు
- నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు
- జేసీ అపూర్వ భరత్ హెచ్చరిక

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :**కాకినాడ జిల్లాలో పారిశుద్ధ్య వ్యవస్థను ప్రక్షాళన చేసే దిశగా జిల్లా యంత్రాంగం నడుం బిగించింది. జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ నేతృత్వంలో మంగళవారం నుంచి జిల్లావ్యాప్తంగా భారీ ఎత్తున 'ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్' శ్రీకారం చుట్టారు.. పట్టణ ప్రాంతాలను సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా చేపట్టిన ఈ పనులను జేసీ స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు.

**కాలువ రోడ్డుపై ప్రత్యేక దృష్టి**

తొలుత కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలోని కాకినాడ – సామర్లకోట కెనాల్ రోడ్డులో జరుగుతున్న పనులను మున్సిపల్ కమిషనర్ ఎన్వీవీ సత్యనారాయణతో కలిసి జేసీ పరిశీలించారు. ఇంద్రపాలెం వంతెన నుంచి ప్రతాప్ నగర్ బ్రిడ్జి వరకు రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్తను, భారీ మట్టి దిబ్బలను జేసీబీలు,బ్లేడ్ ట్రాక్టర్ల సహాయంతో అధికారులు తొలగిస్తున్నారు.

**నిఘా నీడలో పారిశుద్ధ్యం**

ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. పట్టణ పరిసరాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడమే ఈ డ్రైవ్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ, రాత్రి వేళల్లో రహదారులపై చెత్త వేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

– రాత్రి గస్తీ: రహదారులపై చెత్త వేయకుండా నిరోధించేందుకు ప్రత్యేక టీమ్స్ ఏర్పాటు.

– సీసీ కెమెరాలు: నిబంధనలు ఉల్లంఘించే వారిని గుర్తించేందుకు కీలక ప్రాంతాల్లో నిఘా కెమెరాల ఏర్పాటు.

**పలు పట్టణాల్లో ముమ్మరంగా పనులు**

కాకినాడతో పాటు పిఠాపురం, గొల్లప్రోలు, పెద్దాపురం,

- తరువాయి 2లో..



# కోనసీమ అభివృద్ధికి
## కృషిచేసిన వ్యక్తి బాలయోగి

### –నివాళులు అర్పించిన ఎమ్మెల్యే బండారు

**కొత్తపేట,మేజర్‌న్యూస్ :** కోనసీమ అభివృద్ధికి ఎనలేని కృషిచేసిన గొప్ప వ్యక్తి భారత లోక్ సభ మాజీ స్పీకర్ గంటి మోహన చంద్ర బాలయోగి అని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మంగళవారం బాలయోగి వర్ధంతి సందర్భంగా ఆయన స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లో విగ్రహానికి పూలమాలలు వేసి ఎమ్మెల్యే బండారు ఘన నివాళులుఅర్పించారు. అనంతరం ఆయన కోనసీమలో ఏమూలకు వెళ్ళినాఈప్రాంతఅభివృద్ధిలో ఆయన అడుగుజాడలు కనిపిస్తాయన్నారు. కొత్తపేట నియోజకవర్గంలో జాతీయ రహదారి రావడానికి, జొన్నాడ వద్ద,సిద్ధాంతం వద్ద నూతనంగా రెండు వారధులు ఏర్పడడానికి ఆయనే కారణమన్నారు. యానాం –ఎదుర్లంకవారధి, బోడసకుర్రు వారధుల నిర్మాణానికి ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు.

దశాబ్ద కాలం పాటు వివిధ పదవుల్లో ప్రజా ప్రతినిధిగా సేవలందించి లోక్ సభ స్పీకర్‌గా ఉన్నత శిఖరాలకు చేరారన్నారు. వారి మీద అభిమానంతో వారికుమారుడు హరీష్‌మాధూర్ పార్లమెంటు సభ్యునిగా ఉన్నారన్నారు. ప్రజల హృదయాల్లో చిరకాలం బాలయోగి నిలిచి ఉంటారని కొనియాడారు.

- తరువాయి 2లో..

## ఏజెన్సీ గ్రామాల్లో
# 'పెద్దపులి' కలకలం!

### - గంగవరం మండల అటవీ ప్రాంతంలో సంచారం
### - దూర ప్రాంతాలకు తరలించాలని విజ్ఞప్తి





**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** గత కొద్దిరోజులుగా రంపచోడవరం అటవీ ప్రాంతంలో ప్రజలను ప్రజలను హడలెత్తిస్తున్న పెద్దపులి గంగవరం మండలం అటవీ ప్రాంతంలోకి ప్రవేశించినట్లు తాజా సమాచారం. ఇప్పటికే రంపచోడవరం మండలం పెద్ద కొండ తాళ్లపాలెం ప్రాంతాల్లో పశువులపై దాడి చేసిన పెద్దపులి ఏక్షణాన గ్రామాలపైకి వచ్చి మనుషులపై దాడి చేస్తుందోనని ప్రజలు భయకంపితులవుతున్నారు. తాళ్లపాలెం అటవీ ప్రాంతంలో మూడు రోజులుపాటు సంచరించిన పెద్దపులి అక్కడినుండి చుప్పరపాలెం, బోలగోండ అటవీ ప్రాంతాల మీదుగా గంగవరం మండలంమర్రిపాలెం ప్రాంతాల వైపుదాని ప్రయాణం కొనసాగిస్తున్నట్లు సమాచారం. అటవీశాఖ అధికారులుమాత్రం పెద్దపులి సంచారంపై సరైన సమాచారాన్ని అందించలేకపోతు న్నారు. కాగారంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం జరిగిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి రంపచోడవరం పరిసర గ్రామస్తులు కొంతమంది

- తరువాయి 2లో..

# మంత్రి సుభాష్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో
## చేరిన 76 మంది వైసీపీ కార్యకర్తలు

- కూటమి ప్రభుత్వ సంక్షేమ పాలనపై విశ్వాసంతో పార్టీలో చేరామని వెల్లడి
- పార్టీ కండువా వేసి ఆహ్వానించిన మంత్రి సుభాష్, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం





**రామచంద్రపురం, మేజర్‌న్యూస్ :** రామచంద్రపురం లయన్స్ క్లబ్ కళ్యాణమండపంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో 76 మంది వైసీపీ కార్యకర్తలు రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం సమక్షంలో తెలుగుదేశంపార్టీలో చేరారు. స్థానిక రెండో వార్డు స్టీల్‌వెల్ పేటకు చెందిన దోమలపాటి విజయ లక్ష్మి రాజశేఖర్,దొమ్మలపాటి లాలిప్రసాద్ ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. పార్టీలో చేరిన వారందరికీ మంత్రి సుభాష్‌తో పాటు కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం తెలుగుదేశం పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

ఈసందర్భంగాపార్టీలో చేరిన కార్యకర్తలు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వ ప్రజా సంక్షేమ పాలన, మంత్రి సుభాష్ చేపడుతున్న నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలు, సామాజిక

- తరువాయి 2లో..

# ఏజెన్సీ గ్రామాల్లో 'పెద్దపులి' కలకలం!

పులి విషయమై ఫిర్యాదు చేయడం జరిగింది. కలెక్టర్ ఈ విషయంపై స్పందించి అడ్డతీగల ఫారెస్ట్ సబ్ డివిజన్ ఆఫీసర్ జె.వి.సుబ్బారెడ్డితో మాట్లాడడం జరిగింది. జిల్లా కలెక్టర్ పెద్దపులి విషయం తెలుసుకుని పిటిషనర్లకు పులి కదలికలపై థర్మల్ ఇమేజ్ డ్రోన్ ద్వారా పర్యవేక్షణ కొనసాగుతుందని, తాళ్లపాలెం తర్వాత పశువులు దాడికి గురి కాలేదని, అందువల్ల సమీప గ్రామ ప్రజలు ఏ విధమైన భయభ్రాంతులకు లోను కావాల్సిన అవసరం లేదంటున్నారు. అలాగే ముందస్తు హెచ్చరికల ద్వారా ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తూ చర్యలు తీసుకుంటున్నామని, అటవీశాఖ నాగార్జున సాగర్ శ్రీశైలం టీం నిరంతరం నిఘాతో ప్రజలు, పెంపుడు జంతువులు దాడికి గురి కాకుండా పర్యవేక్షణ చేస్తున్నారని కలెక్టర్ పేర్కొన్నారు.

**నిజ నిర్ధారణ కమిటీ సందర్శన ..**ఇటీవల కాలంలో అటవీశాఖ అధికారులు తూర్పుగోదావరి జిల్లా కూర్మాపురం సమీపంలో బంధించిన పులిని పాపి కొండలు అభయ అరణ్యంలో వదిలిన తరువాత, అక్కడ నుండి పులి తిరిగి వచ్చి రంపచోడవరం మండలం పెదపాడు, పెద్ద కొండ గ్రామంలో ఆవులపై దాడి చేసి, అదే మార్గంలో తాళ్లపాలెం గ్రామంలో ఒక ఆవును చంపిన సంఘటనపై హ్యూమన్ రైట్స్ వాచ్ గ్లోబల్ డైరెక్టర్ బాలు అక్కిస ఆధ్వర్యంలో నిజ నిర్ధారణ కమిటీ కొన్ని ప్రాంతాలను సందర్శించిది. ఇందులో వెలుగులోకి వచ్చిన కొన్ని అంశాలు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్ళారు. సుమారు రెండు నెలల క్రితం పాము గండి, ఆకూరు, మరికొన్ని గ్రామాలలో అటవీ శాఖ అధికారులు మీటింగులు పెట్టి నేషనల్ పార్క్ ఎకో సెన్సిటివ్ జోన్లో భాగంగా గ్రామాలు ఖాళీ చేయాలని గ్రామసభలు తీర్మానం ఇవ్వండని అడిగారన్నారు. ఆదివాసీలైన తమను అడవులు నుంచి బయటకు వెళ్ళటకు సిద్ధంగా లేమని గ్రామ సభ తీర్మానం ఇవ్వమని అన్నారు. గ్రామ సభలో పాపికొండల అభయారణ్యాన్ని ఎకో సెన్సిటివ్ జోన్ రద్దు పరచాలని తీర్మానం చేసారు. (గ్రామ సభలు తీర్మానం, పీసా చట్టం కాగితాలకే పరిమితం అవుతున్నది). ఈ విషయాన్ని అలుసుగా తీసుకుని అటవీ అధికారులు కక్ష పూర్వకంగా కూర్మాపురం సమీపంలో బంధించిన పులిని కొద్ది రోజులు విశాఖపట్నం జంతు సంరక్షణ కేంద్రంలో పరిశీలించి, ఆ తర్వాత పాపికొండల అభయారణ్యం దేవీపట్నం మండలం పరిధి అటవీ ప్రాంతంలో పులిని ఎక్స్‌ప్లోరర్ అనే పేరున వదిలిపెట్టారు. పులికి భయపడి అభయారణ్యంలో ఆదివాసీలు తమ గ్రామాలను ఖాళీ చేస్తారని ఫారెస్ట్ అధికారులు పథకంలో భాగంగా పులిని తీసుకువచ్చి ఇక్కడ వదిలినట్టు స్థానిక ఆదివాసీలు చెబుతున్నారు.

వాస్తవానికి పులి ఇలా అడవులను వదిలి ప్రజా సంచారంలోకి వచ్చినప్పుడు బంధించి జూలో లేదంటే పులులు ఉన్న అభయ అరణ్యంలో పులిని వదలవలసిఉంది. దీనికి భిన్నంగా పులులు సంచారం లేని పాపికొండలు అభయ అరణ్యంలో గిరిజన గ్రామాల మధ్యలో పులిని వదలడం అనేది "పొమ్మనకుండా పొగ పెడుతున్నారు" అన్న చందంగా ఉందన్నారు. అయితే పులికి ఆహారం దొరకకపోవడం లేక బయట ప్రదేశాలలో తిరుగుడానికి అలవాటు పడిన పులి పాపికొండలు అభయారణ్యంలో ఉండకుండా బయట తిరుగుతుందన్నారు. దీనివలన ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవిస్తున్నారు. అంతే కాకుండా ప్రజలు జీడి మామిడి తోటలు శుభ్రం చేసుకుని పిక్కలు సేకరించి సమయంలో పెద్ద పులి సంచారం వల్ల గ్రామస్తులు ఇళ్లకే పరిమితం అయితే వారి జీవనోపాధిపై పులి ప్రభావం పడుతున్నది.

ఈ సంఘటనలు వలన భారత రాజ్యాంగంలో పొందుపరిచిన జీవించే హక్కుకు ఉల్లంఘన కలుగుతుందని, ప్రజల స్వేచ్ఛ జీవితానికి ఆటంకం కలగకుండా పులిని బంధించి వేరే ప్రాంతాలకు తరలించాలని ప్రభుత్వానికి లేఖల ద్వారా తెలియజేశామని హ్యూమన్ రైట్స్ వాచ్ గ్లోబల్ డైరెక్టర్ బాలు అక్కిస మీడియాకు తెలియజేసారు.

# ద్వారకాతిరుమల,ఐఎస్ జగన్నాధపురంలో ఇంటింటికి సిపిఐ




**ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్ :** గడపగడపకు సిపిఐ కార్యక్రమంలో భాగంగా మూడవ రోజు మంగళవారం ద్వారకాతిరుమల,ఐఎస్ జగన్నాధపురం గ్రామాలలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు,మండల కార్యదర్శి గోలిమే బాల యేసు నాయకత్వంలో సిపిఐ కార్యకర్తలు సిపిఐ ప్రసార కార్యక్రమాన్ని నిర్వహించారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) భారతదేశ స్వాతంత్ర ఉద్యమం తో పాటు, కార్మిక వర్గాన్ని సమీకరించి వారి హక్కుల కోసం క్రియాశీల పోరాటాలను నిర్వహించిందని వారు కరపత్రాల ద్వారా ప్రజలకు తెలిపారు. సిపిఐ వంద సంవత్సరాల చరిత్రలో ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేసి ఎన్నో విజయాలను సాధించిందని వారు పేర్కొన్నారు. గడపగడపకు సిపిఐ రాష్ట్ర సమితి ,జిల్లా సమితి ముద్రించిన కరపత్రాలను ప్రజలకు పంచుతూ ప్రజల నుండి విరాళాలను సేకరించారు. నిరంతరం ప్రజా సమస్యలపై పనిచేస్తున్న ప్రజలు విరాళం అందించి సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, వ్యవసాయ కార్మిక, రైతాంగ,ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు నాయకులు వివరించారు.మార్చి 15 వరకు మండలంలో కొనసాగిస్తామని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఐ,ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు యడ్లపల్లి రమేష్, గుదె ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీల ఉద్యమంపై ప్రభుత్వ దమన కాండ : పలువురి ఆగ్రహం



– అక్రమ అరెస్టులకు నిరసనగా రాస్తారోకో

**కైకలూరు, మేజర్ న్యూస్,** అంగన్వాడీల ఉద్యమంపై రాష్ట్ర ప్రభుత్వ ధమరకాండకు, విజయవాడలో అక్రమ అరెస్టులకు నిరసనగా సిఐటియు, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కైకలూరులో జాతీయ రహదారిపై రాస్తారోకో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తాలూకా ఆఫీస్ సెంటర్ వద్ద ధర్నా చేపట్టారు. అక్రమంగా అరెస్టు చేసిన అంగన్వాడీలను విడుదల చేయాలని, జీతాలు పెంచాలని, సమస్యల పరిష్కరించాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి జక్కుల మహేష్,అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కైకలూరు ప్రాజెక్టు అధ్యక్షురాలు ఆంద్రు చల్లమ్మ, కార్యదర్శి పోలవరపు సుజాత మాట్లాడుతూ అంగన్వాడీలు జీతాలు పెంచకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. 30శాతం ఎమ్మెల్యేల జీతాలు పెంచిన రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల వేతనాలు ఎందుకు పెంచడం లేదని ప్రశ్నించారు. కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా ధర్నా నిర్వహిస్తున్న అంగన్వాడీలను విజయవాడ ధర్నా చౌక్‌లో అత్యంత దుర్మార్గంగా అర్ధరాత్రి అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. అరెస్టులు చేయడమే కాకుండా రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు తరలించి ఇబ్బందులకు గురి చేయడం, మహిళలని చూడకుండా రాష్ట్ర ప్రభుత్వం కర్కశంగా వ్యవహరించడం దారుణమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కమిటీ కోశాధికారి మీనా కుమారి, సహాయ కార్యదర్శి ఎస్.కె అబీద, జి విజయలక్ష్మి,పి.లక్ష్మి, జి ఝాన్సీ రాణి, బి.సత్యవతి, రమాదేవి,మేనకా లక్ష్మి, మణి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో పారిశుద్ధ్య 'గర్జన'..

మొదటిపేజి తరువాయి

సామర్లకోట పట్టణాల్లో కూడా ఈ డ్రైవ్ ముమ్మరంగా సాగుతోంది. ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న పనులను జేసీ స్వయంగా తనిఖీ చేసి, మున్సిపల్ కమిషనర్లకు పలు సూచనలు చేశారు. పనులు నాణ్యంగా, వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ కె.టి.సుధాకర్, ఎస్.ఈ. పి.వెంకట్రావు, హెల్త్ ఆఫీసర్ డా. పృథ్వీచరణ్, పిఠాపురం కమిషనర్ కనకారావు తదితర అధికారులు పాల్గొన్నారు.

# కోనసీమ అభివృద్ధికి కృషిచేసిన వ్యక్తి బాలయోగి

మొదటిపేజి తరువాయి

ఈ కార్యక్రమంలో జిల్లా తెదేపా ఉపాధ్యక్షుడు ముత్యాల బాబ్జి,కొత్తపేట సర్పంచ్ బూసి జయలక్ష్మి భాస్కరరావు, మండల తెదేపా అధ్యక్షుడు గనిశెట్టి వీరేష్, ధరణాల రామకృష్ణ, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి సుభాష్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరిన 76 మంది వైసీపీ కార్యకర్తలు

మొదటిపేజి తరువాయి

సేవల పట్ల ఆకర్షితులై తెలుగుదేశం పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. ప్రజల కోసం పారదర్శకంగా పనిచేస్తున్న నాయకత్వాన్ని బలపర్చడం తమ లక్ష్యమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ పార్టీ నాయకులతో మమేకమై, సమన్వయం చేసుకొని తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమిపార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఎఎంసి చైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్,పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఉండవల్లి శివ, ఉపాధ్యక్షులు చందమామ వాసు, కవల నానాజీ, క్లస్టర్ ఇంచార్జ్ కంచుమర్తి బాబురావు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ దంగేటి గౌరీ శంకర్, నియోజవర్గ రైతు అధ్యక్షులు బలుసు శివప్రసాద్, పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొన్నారు.

# కార్పొరేషన్‌లో ఇంజనీరింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి



**ఏలూరు,మేజర్ న్యూస్ :** ఏలూరు కార్పొరేషన్ లో ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏ ఐటియుసి) ప్రధాన కార్యదర్శి ఏ. అప్పలరాజు కమిషనర్ కలిసి విజ్ఞాపన పత్రాలను అందజేశారు. పబ్లిక్ హెల్త్ డ్రైవర్ గా ప్రమోషన్ పొందిన పంతం వెంకటేశ్వరావు కి 2022 ఏప్రిల్ ఒకటి నుండి ఏరియర్స్ తో కలిపి నేటి వరకు డ్రైవర్ శాలరీని చెల్లించే విధంగా తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా కమీషనర్ కు విజ్ఞప్తి చేశారు.వెంకన్న చెరువు వద్ద గల అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పంపింగ్ స్టేషన్ పంపు హౌస్ సంపు ఉన్న రూముని, వాచ్ మెన్ రూముని, డిపి స్టేషన్ పడిపోయిన ప్రహరీ గోడను బాగు చేయించాలని ఆయన కమీషనర్ ను కోరారు. నగరపాలక సంస్థలో హెవి వెహికల్ డ్రైవర్ల సీనియారిటీ లిస్టును విడుదల చేయవలసిందిగా కమిషనర్ వారికి విజ్ఞప్తి చేశారు. కమిషనర్ విజ్ఞాపన పత్రాలపై సంతకం చేసి మున్సిపల్ ఇంజనీర్‌కి, పిహెచ్ సెక్షన్ సూపర్ రెడ్డికి పంపారని అప్పలరాజు తెలిపారు. కమిషనర్‌ను కలిసిన వారిలో యూనియన్ బాధ్యులు కే బాలాజీ,లోమీ తదితరులు పాల్గొన్నారు.

# వైసిపి మాజీ మండల అధ్యక్షుడు జనసేనలో చేరిక





**– కండువా కప్పి ఆహ్వానించిన మంత్రి దుర్గేష్**

**రావులపాలెం, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని దేవరపల్లి గ్రామ సర్పంచ్, మాజీ మండల వైసీపీ అధ్యక్షులు దొమ్మేటి అర్జున రావు వైసీపీని వీడి జనసేన పార్టీలో చేరారు. సోమవారం కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ జనసేన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతో దొమ్మేటి మణికంఠ కూడా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ "జనసేపార్టీ సిద్ధాం తాలు, అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆశయాలు నచ్చి, బండారు శ్రీనివాస్ నాయకత్వాన్ని చూసి, ఆయనను బలపరచాలనే ఉద్దేశ్యంతో పార్టీలో చేరటం జరిగింది అని చెప్పారు. గత రెండు ఏళ్ల నుండి కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం బాగా చేస్తుందని, ముఖ్యంగా పవన్ కళ్యాణ్ గ్రామీణ మరియు పంచాయతీ రాజ్ శాఖల బలోపేతానికి ఆయన చేస్తున్న కృషి అభినందనీయం అని కొనియాడారు. అలాగే నియోజకవర్గంలో బండారు శ్రీనివాస్‌తో కలసి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు తోట స్వామి, జిల్లా కార్యదర్శులు బొక్క ఆదినారాయణ, దొంగ వెంకట సుబ్బారావు, బండారు బాబి, దేవరపల్లి పార్టీ అధ్యక్షులు అప్పారి నాగేంద్ర, శరత్ పవన్, రత్నాజీ తదితరులు పాల్గొన్నారు.

# ‘ఐఐఎఫ్‌టి’కి కేంద్రం పెండింగ్ నిధులు విడుదల





**– వచ్చే విద్యా సంవత్సరం నుండి అందుబాటులోకి ఐఐఎఫ్‌టి క్యాంపస్**

**– ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ వెల్లడి**

**కాకినాడ, మేజర్ న్యూస్ :** పిఠాపురం నియోజకవర్గం, పొన్నాడ శివారు శీలంవారిపాలెం వద్ద నిర్మాణంలో ఉన్న ప్రతిష్ఠాత్మక ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (ఐఐఎఫ్‌టి) కు కేంద్ర ప్రభుత్వం రూ. 28.43 కోట్లు పెండింగ్ నిధులు విడుదల చేసినట్లు కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ వెల్లడించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రూ. 229.81 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఐఐఎఫ్‌టి క్యాంపస్ నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో 50% నిధులు భరిస్తుండగా, ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులు రూ. 114.90 కోట్లు విడుదల చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన పెండింగ్ నిధుల కోసం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచనలతో పలుమార్లు కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌ను వ్యక్తిగతంగా కలిసి విజ్ఞప్తి చేయడంతో పాటు, సంబంధిత అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరపడంతో కేంద్రం సానుకూలంగా స్పందించి పెండింగ్ నిధులు రూ. 28.43 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా నిధులు వంద శాతం విడుదలవ్వడంతో త్వరలోనే నిర్మాణం పూర్తయ్యి, వచ్చే విద్యా సంవత్సరం నుండి ఐఐఎఫ్‌టి క్యాంపస్ అందుబాటులోకి వస్తుందని తెలిపారు. పెండింగ్ నిధులు విడుదల చేసి క్యాంపస్ నిర్మాణానికి సహకరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ సందర్భంగా ఎంపి ఉదయ్ శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

# అక్రమ అరెస్టులతో అంగన్వాడీల ఉద్యమాన్ని ఆపలేరు

**– కొత్తపేట అగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్**



**రావులపాలెం,మేజర్‌న్యూస్ :**అక్రమ అరెస్టులతో అంగన్వాడీ కార్యకర్తల ఉద్యమాలను అణచివేయలేరని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కొత్తపేట ప్రాజెక్టు నాయకురాలు వెంకటలక్ష్మి అన్నారు. మంగళవారం కొత్తపేట ప్రాజెక్టు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అక్రమ అరెస్టులు ఆపి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగావారు మాట్లాడుతూ విజయవాడలో శాంతియుతంగా అంగన్వాడీ సంఘం నాయకులు చేపట్టిన దీక్షలను భగ్నం చేసి అర్ధరాత్రి అరెస్టులు చేయడం దుర్మార్గ చర్య అని, వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం అమలు చేయాలనే ప్రధాన డిమాండ్‌తో అంగన్వాడీ కార్యకర్తలు చేపట్టిన ఉద్యమాన్ని ప్రభుత్వం నిరంకుశంగా అణగదొక్కాలని చూస్తే మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కె. సూర్యకళ, ఆర్. ఇందిరమ్మ, వై. ఈ. రాణి, జి. వీరవేణి, సత్యవేణి, ఐ. రూపావతి, అధికసంఖ్యలో కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

## బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేసిన మహనీయులు జిఎంసి బాలయోగి

**– శాసనసభ్యులు వనమాడి కొండబాబు**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కొరకు జిఎంసి బాలయోగి అహర్నిశలు కృషి చేశారని, సామాన్య కుటుంబంలో జన్మించి లోక్ సభ స్పీకర్ గా ఎదిగి దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసి దేశానికి, రాష్ట్రానికి ఈయన లేని సేవలు అందించారని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. లోక్ సభ తొలి దళిత స్పీకర్, టీడీపీ సీనియర్ నేత జీఎంసీ బాలయోగి వర్ధంతి సందర్భంగా జగన్నాధపురం యానం రోడ్డు నందు గల జిఎంసి బాలయోగి విగ్రహానికి పూలమాలవేసి కొండబాబు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ దళితులు, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి జిఎంసి బాలయోగి అహర్నిశలు కృషిచేశారని, తూర్పు గోదావరి జిల్లా ముమ్మిడివరం మండలంలోని యెదురులంకలో ఒక సామాన్య దళిత రైతు కుటుంబంలో జన్మించి, లోక్ సభ స్పీకర్ గా ఎదిగి, దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారని, 12, 13వ లోక్‌సభలకు స్పీకర్‌గా ఎన్నికై, అత్యంత సమర్థుడిగా పేరు తెచ్చుకున్నారని, కోనసీమ ముద్దుబిడ్డ బాలయోగి గారి ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షులు అంబటి సత్యనారాయణ (చిన్న), బొద్దు దేవరాజు, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లాబత్తుల అప్పారావు, పలివెల రవి అనంత కుమార్, గదుల సాయిబాబా, బంగారు సత్యనారాయణ, పంతాడి రాజు, గొరుసు వెంకట దుర్గారావు, బూడి ప్రకాష్, ఆకుల జాన్ వెస్లీ, తెప్పల రామలింగేశ్వరరావు, సయిద్ అలీ, పాలిక నాని, సంఘాని నాగూర్, మండపాక దుర్గాప్రసాద్, ఆయేషా, బత్తిన ఉమా, తాడిచర్ల వెంకటేశ్వరరావు, పాలెపు నాగేశ్వరరావు, సంఘాని నాగేశ్వరరావు, గుత్తుల రమణ, అమలకంటి బలరాం, దౌర్ల చిట్టిబాబు, ఓలేటి పాండు, పట్టా ధనలక్ష్మి, బలసాడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## వెంకన్న నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



ఆత్రేయపురం, మేజర్ న్యూస్ : కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి నిత్యాన్నదాన పథకానికి మంగళవారం విజయవాడ సీతారామపురం కు చెందిన నీరుమల్ల వెంకట భాగ్యరావు అంజనీ దంపతులు వారి కుటుంబ సభ్యులు రూ. 1,00,116 లు విరాళంగా అందించారు. వీరికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి చరిత్ర గురించి వివరించారు. చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు స్వామివారి చిత్రపటాన్ని అందించారు.

సూర్య
www.suryaa.com
మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా...
సంప్రదించండి సెల్ : 9989800678
అతి తక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరు మార్పు, లీగల్ ప్రకటనలకు, మీ కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ఏవైనా సరే
సంప్రదించండి. సెల్ : 9032209779

# జిల్లా తెదేపా కార్యాలయంలో జి.ఎం.సి బాలయోగికి ఘన నివాళులు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేసిన మహనీయులు, లోక్‌సభ తొలి దళిత స్పీకర్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత గంటి మోహన చంద్ర బాలయోగి వర్ధంతి సందర్భంగా మంగళవారం కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస్ బాబా, స్టేట్ పెరిక వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ వనపర్తి బద్రి,ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లాబత్తుల అప్పారావు తదితరులు బాలయోగి గారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం ఎమ్మెల్యే కొండబాబు, చిక్కాల రామచంద్రరావు, పెంకే శ్రీనివాస్ బాబా, కొల్లాబత్తుల అప్పారావు, ఎస్సీ సెల్ సిటీ అధ్యక్షులు అంబటి సత్యనారాయణ (చిన్న) మీడియాతో మాట్లాడుతూ బాలయోగి విశేష సేవలను స్మరించుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా యెదురులంకలో ఒక సామాన్య దళిత రైతు కుటుంబంలో జన్మించిన బాలయోగి .. కాకినాడలోనే న్యాయవాద వృత్తిని ప్రారంభించి, ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్‌గా, తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ ఛైర్మన్‌గా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని గుర్తుచేశారు. ముమ్మిడివరం ఎమ్మెల్యేగా, రాష్ట్ర ఉన్నత విద్యా శాఖా మంత్రిగా ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. తెలుగుదేశం పార్టీ తరపున పార్లమెంటుకు ఎన్నికై 12వ, 13వ లోక్‌సభలకు స్పీకర్‌గా దేశ రాజకీయాల్లో చెరగని ముద్ర వేశారని, వివిధ పార్లమెంటరీ కమిటీలకు అధ్యక్షత వహించి అంతర్జాతీయ స్థాయిలో దేశ గౌరవాన్ని ఇనుమడింపజేశారని కొనియాడారు. కోనసీమ ముద్దుబిడ్డ బాలయోగి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో చప్పిడి వెంకటేశ్వరరావు, నురుకుర్తి వెంకటేశ్వరరావు, పార్లమెంట్ కమిటీ సభ్యులు బి.రామలక్ష్మి, దేవు వెంకన్న, గాది శివరామకృష్ణ, ఎస్.కె. రహీమ్, నాయకులు పలివెల రవి అనంత కుమార్, గదుల సాయిబాబా, కోన వెంకట లక్ష్మి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైద్యం పొందుతున్న జోగిరెడ్డిని ఫోన్ ద్వారా పరామర్శించిన ఎమ్మెల్యే శిరీషదేవి భాస్కర్

**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** ఇటీవల చెట్టుమీద నుండి పడి తీవ్ర గాయాలై కాకినాడ జిజిహెచ్‌లో వైద్యం పొందుతున్న టీడీపీ కార్యకర్త కోసూరి జోగిరెడ్డిని స్థానిక ఎమ్మెల్యేమిరియాల శిరీషా భాస్కర్ ఫోన్ ద్వారా మాట్లాడి ఆరోగ్య విషయం తెలుసుకున్నారు. జోగిరెడ్డికికాలు, చెయ్యి ఫ్యాక్చర్ అవ్వడం, మెడవద్ద బలమైన దెబ్బ తగలడం వల్ల వెన్నుపూస ఆపరేషన్ చేయాల్సివస్తుంది.

జిజిహెచ్ డాక్టర్లతో ఎప్పటికప్పుడు ఎమ్మెల్యే శిరీషమాట్లాడి ఫాలో అప్ చేస్తున్నారు. సోమవారం రాత్రి పార్టీసీనియర్ నాయకులు గణజాల తాతారావ్ వెళ్లి ,పలకరించి ఆరోగ్య పరిస్థితి పై తెలుసుకుని ఎమ్మెల్యే కు చెప్పగా ఆమె జోగిరెడ్డి తో ఫోన్ లో స్వయంగా మాట్లాడారు , జిజిహెచ్ వైద్యులతో మాట్లాడానని ఆపరేషన్ చేసి ,మెరుగైన వైద్యం అందిస్తారని ధైర్యంగా ఉండాలని,మీరు మరలా కోలుకొని యధావిధిగా తిరుగుతారని మొన్ననే మీ ఇంటికి కూడా వెళ్ళి అమ్మతో మాట్లాడానని జోగిరెడ్డితో అన్నారు. నా ఆరోగ్యం మెరుగవ్వడానికి మీరు నా పట్ల చూపుతున్న శ్రద్ధకు ఎమ్మెల్యే శిరీష భాస్కర్‌కు జోగిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.



# వేట్లపాలెం ఘటనపై కలెక్టర్ కలిసిన మందకృష్ణ మాదిగ



**సామర్లకోట,మేజర్‌న్యూస్ :** వేట్లపాలెం పేలుడు దుర్ఘటనపై కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలిని కలిసి భాధిత కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన ఎక్స్‌గ్రేషియా కన్నా ఎక్కువ ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని. ఈ ఘటనలో భర్తలను కోల్పోయిన వారికి వెంటనే విడో పెన్షన్లు, త్వరగా మంజూరు చేయాలని అన్ని విధాలుగా బాధిత కుటుంబాలను ప్రభుత్వమే ఆదుకోవాలని కాకినాడ జిల్లా కలెక్టర్‌కి విజ్ఞప్తి చేసి వినతి పత్రాన్ని మందకృష్ణ మాదిగ అందజేశారు.

# ప్రజల గుండెల్లో బాలయోగి చిరస్థాయిగా నిలిచి ఉంటారు - జ్యోతుల నవీన్



జగ్గంపేట, మేజర్ న్యూస్ : ఉమ్మడి గోదావరి జిల్లాల ముద్దుబిడ్డ, భారత లోక్ సభ మాజీ స్పీకర్ గంటి మోహన చంద్ర బాలయోగి ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచి ఉంటారని కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ అన్నారు. మంగళవారం బాలయోగి వర్ధంతి సందర్భంగా స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతుల నవీన్ ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి గోదావరి జిల్లాలతో పాటు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన బాలయోగి పేరు ప్రఖ్యాతులు ఇక్కడి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటాయని కొనియాడారు. గోదావరి జిల్లాలలో ఏ మూలకు వెళ్ళినా ఈ ప్రాంత అభివృద్ధిలో ఆయన అడుగుజాడలు కనిపిస్తాయన్నారు. యానాం - ఎదుర్లంక వారధి, బోడసకుర్రు వారధుల నిర్మాణానికి ఆయన చేసిన కృషి మరువలేని దన్నారు. ఒక దశాబ్ద కాలం పాటు వివిధ పదవుల్లో ప్రజా ప్రతినిధిగా సేవలందించి లోక్ సభ స్పీకర్‌గా ఉన్నత శిఖరాలకు చేరారన్నారు.

వారి మీద అభిమానంతో వారి కుమారుడు హరీష్ మాధూర్ పార్లమెంటు సభ్యునిగా ఉన్నారన్నారు. ప్రజల హృదయాల్లో చిరకాలం బాలయోగి నిలిచి ఉంటారని కొనియాడారు. ఆయన బాటలో నడిచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అభివృద్ధికి తామంతా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, జీనుమణి బాబు, ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్తకొండ బాబు, కందుల చిట్టిబాబు, దేవరపల్లి మూర్తి, రేఖ బుల్లి రాజు, బుర్రి సత్తిబాబు పాండ్రంగి రాంబాబు, తూము కుమార్, యిడుదల అర్జునరావు, రాయి సాయి, పిల మహేష్, రాష్ట్ర డైరెక్టర్ గెద్దాడ సత్యవేణి, కొండ్రోతు శ్రీను, సొంబత్తుల చంద్రశేఖర్, తుమ్మల కిషోర్ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలపై రాష్ట్ర ప్రభుత్వ దాడిని ఖండించండి

**- సిఐటియు ఆధ్వర్యంలో నిరసన**



**పెద్దాపురం,మేజర్‌న్యూస్:**కనీస వేతనాలు అమలు చేయాలని, గ్రాట్యూటి ఇవ్వాలని, స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, డిమాండ్ చేస్తూ విజయవాడలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లను ప్రభుత్వం పోలీసుల ద్వారా అరెస్టు చేయడాన్ని సిఐటియు పెద్దాపురం మండల కమిటి తీవ్రంగా ఖండించింది. దీనిలో భాగంగా మున్సిపల్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్ల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని, అలాగే అరెస్టు చేసిన వారిని తక్షణం విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి డి.క్రాంతికుమార్, ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు చింతల సత్యనారాయణ, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు జాగరపు కుమారిలు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పలువురు యూనియన్ నాయకులు వడ్డి సత్యనారాయణ, తైనాల శ్రీను, సీతా రమణమ్మ, బి.సత్యనారాయణ, రొంగల వీర్రాజు, కేదారి నాగు, మద్దతు పలికారు. పలువురు పాల్గొన్నారు.

## చంద్రగ్రహణం సందర్భంగా మరిడమ్మ అమ్మవారి ఆలయం మూసివేత



పెద్దాపురం, మేజర్ న్యూస్ : పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి ఆలయం 3వ తేది మంగళవారం మధ్యాహ్నం 3.15 నుండి సాయంత్రం 6.27 ని.ల వరకు చంద్రగ్రహణం సందర్భంగా శ్రీ మరిడమ్మ అమ్మవారి ఆలయ ద్వారములు ఉదయం 9.30 లకు మూసివేయబడినట్లు దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మీ తెలిపారు. తిరిగి 4వ తేది బుధవారం ఉదయం 6 గంటల నుండి శ్రీ మరిడమ్మ అమ్మవారి పున:దర్శనం కలుగునని కావున భక్తులు గమనించవలసినదిగా అసిస్టెంట్ కమీషనర్ కోరారు.

## అక్షరాంధ్ర కార్యక్రమంపై అవగాహన సదస్సు



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** రావులపాలెంలో అక్షర ఆంధ్ర కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అక్షరాస్యత ప్రాధాన్యంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు స్థానిక విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, మహిళలు పాల్గొని అక్షరాస్యత ప్రాముఖ్యతను వివరించారు. నిరక్షరాస్యత నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు. పెద్దలకు అక్షరాస్యత తరగతులు నిర్వహించాల్సిన అవసరాన్ని వక్తలు ప్రస్తావించారు. అక్షరాస్యతతోనే సమాజ అభివృద్ధి సాధ్యమని, ప్రతి కుటుంబంలో కనీస విద్యాభ్యాసం ఉండాలని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో యానిమేటర్ కావేరి తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుండి సింగరమ్మ అమ్మవారి జాతర జాతరకు ముమ్మర ఏర్పాట్లు

**– అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్**



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** జగ్గంపేట మండలం మల్లిశాల గ్రామ శివారు అటవీప్రాంతంలో కొలువై ఉన్న సింగారమ్మ అమ్మవారి జాతర మహోత్సవములు మార్చి మూడో తేదీ మంగళవారం నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ జాతర మహోత్సవాల తొలిరోజు అమ్మవారిని జగ్గంపేట శాసనసభ్యులు, టీటీడీ బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ కమిటీ వారిని ఘనంగా సత్కరించి అమ్మవారి చిత్రపటాలను బహుకరించారు. మల్లిశాల గ్రామ వాసుల ఆరాధ్య దేవతగా, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా అమ్మవారు ప్రసిద్ధి కెక్కారు. ప్రతి సంవత్సరం మార్చ్ నెలలో అమ్మవారి జాతరను ఐదు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. మంగళవారం నుండి అమ్మవారి జాతరను పురస్కరించుకొని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని సర్వంగా సుందరంగా తీర్చి దిద్దారు. ఆలయ ఆవరణ విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులు కోసం తరలి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సింగారమ్మ అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులు మొక్కులు తీర్చుకొని ఆలయ ఆవరణలో కుటుంబ సభ్యులందరితో సహపంక్తి భోజనాలు చేస్తారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకోసం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అనేకరకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మార్చ్ 3 నుండి 7వరకు అమ్మవారి జాతర అత్యంత వైభవంగా జరగనుంది. అమ్మవారి జాతర పురస్కరించుకొని ఐదుగురు కమిటీని ఏర్పాటు చేశారు.

ఈ కమిటీలో ముండ్రు కృష్ణారావు (ఎర్రబాబు ), పైడిపాల సూరిబాబు, పాలికిరెడ్డి సత్యనారాయణ, నక్కరాజు వీరబాబు, కుప్పల నాగులను నియమించారు. అందరి సమన్వయంతో జాతర ను విజయవంతం చేయడానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. ఈ సందర్భంగా సింగారమ్మ ఆలయ కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మార్చ్ నెలలో సింగారమ్మ అమ్మవారి జాతర మల్లిశాల గ్రామస్తుల సహాయ సహకారాలతో నిర్వహిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ జాతరకు విచ్చేసి అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్, ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, దేవరపల్లి మూర్తి, బుర్రి సత్తిబాబు, పాండ్రంగి రాంబాబు, సర్పంచి సర్వసిద్ది లక్ష్మణరావు,పాలచర్ల నాగేంద్ర చౌదరి, పల్లికొండ భద్రం, తొట్టిపూడి నాగేశ్వరరావు, సియాధుల పెద్దకాపు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# గోర్స రోడ్డు నిర్మాణం చేపట్టాలని నిరసన

**పిఠాపురం, మేజర్ న్యూస్ :** గోర్స రోడ్డు నిర్మాణం చేపట్టాలని సిపిఐ ఆధ్వర్యంలో ఆటో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు సాకా రామకృష్ణ మాట్లాడుతూ.. పిఠాపురం అంబేద్కర్ సెంటర్ నుండి నేమాం పరిధిలో గల 12 కిలోమీటర్ల విస్తరణ కలిగిన గోర్స రోడ్డు పూర్తిగా శిధిలావస్థకు చేరుకుందని, ఎక్కడిక్కడ గుంతలు పడడంతో రోడ్డు అనుకుని ఉన్న గ్రామాలు కొమరగిరి, గోర్స ఆనందనగరం, నాగంపేట ఏడుకాలవులు, కొత్త కొంపలు ప్రజలు ప్రయాణిస్తూ ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. స్కూల్ పిల్లలు, ఎమర్జెన్సీ పేషెంట్లు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని, తక్షణమే రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. 2 నెలలనుండి రెండు కోట్ల 10 లక్షలు నిధులు వచ్చినట్లుగా అధికారులు చెబుతున్నారని, కాని ఇంతవరకు పనులు ప్రారంభించలేదని అన్నారు. తక్షణమే నాణ్యత కలిగిన రోడ్డు వేయకపోతే సంబంధిత కార్యాలయం ముట్టడిస్తామని



హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గంధం సుబ్రమణ్యం, మట్టాడ జాన్, సబ్బ ప్రసాద్, ఏడిది అర్జునుడు, వి.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అనపర్తిలో కాలువలో బాలుడు గల్లంతు

**– గాలింపు చర్యలు కొనసాగింపు**



**అనపర్తి, మేజర్ న్యూస్ :** అనపర్తి గ్రామంలో మంగళవారం విషాద సంఘటన చోటుచేసుకుంది. అనపర్తి గ్రామానికి చెందిన బాలుడు ఎర్ర కాలువలో పడి గల్లంతయ్యాడు. స్థానికులు, పోలీసులు తెలిపి సమాచారం ప్రకారం మంగళవారం హోలీ పండుగ సందర్భంగా పాఠ శాలలో సెలవు కావడంతో అనపర్తి గ్రామానికి చెందిన సాత్విక్, శేఖర్, బన్ను, రాహుల్ కలిసి గ్రామంలోని ధరణికోట శివాలయం వద్ద ఎర్ర కాలువ రేవులో స్నానానికి దిగగా ప్రమాదం సంభవించిందని, స్నానం చేస్తుండగా శేఖర్ మరియు రాహుల్ కాలువలో కొట్టుకుపోతుండగా సమీపంలో ఉన్న సత్తిబాబు అను వ్యక్తి గమనించి వెంటనే స్పందించి శేఖర్‌ను కాలువలోనుండి బయటకు తీశాడు. అయితే రాహుల్ మాత్రం ప్రవాహంలో కొట్టుకుపోయాడు. రాహుల్ కొట్టుకుపోతుండగా అతని అన్న బన్ను కేకలు వేస్తూ కాలువ గట్టుపై కొంతదూరం పరిగెత్తినట్టు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. అలాగే కాలువ గట్టుపై చెత్త పారవేస్తున్న బద్దా లక్ష్మీ కూడా ఈ ఘటనను చూసినట్లు సమాచారం. ఈ ఘటనపై మిస్సింగ్ అయిన రాహుల్ తండ్రి దేవ అలియాస్ విజయకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనపర్తి అదనపు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాలుడి ఆచూకీ కోసం ఫైర్ డిపార్ట్మెంట్ సిబ్బంది లైవ్ బాయ్ సహాయంతో కాలువలో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. ఈ విషయాన్ని ఇరిగేషన్ డిపార్ట్మెంట్ మరియు ఉన్నతస్థాయి పోలీస్ అధికారులకు తెలియజేశారు.

అనపర్తి ఎస్ఐ శ్రీను నాయక్, అదనపు ఎస్ఐ దుర్గ ప్రసాద్, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి బాలుడి కోసం గాలింపు చర్యలను పర్యవేక్షి స్తున్నారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీను నాయక్ మాట్లాడుతూ వేసవికా లం సమీపిస్తున్న తరుణంలో ఒక పూట బడి సమయంలో మరియు వేసవి సెలవుల్లో పిల్లలు కాలువల వద్దకు, చెరువుల వద్దకు స్నానాలు చేసేందుకు పంపించరాదని, ప్రమాదవశాత్తు మునిగి ప్రాణాలు పోగొట్టుకుం టున్నారని, గతంలో ఇలాంటి సంఘటనలు జరిగినాయని పిల్లల్ని స్కూల్లో టీచర్లు విద్యార్థులకు అవగాహన కల్పించాలి, అలాగే తల్లిదండ్రులు పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా అన్నారు.

# సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలి

**– సిఐ నరసింహమూర్తి**



**అడ్డతీగల, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ వాసులంతా సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అడ్డతీగల సీఐ నరసింహమూర్తి స్పష్టం చేశారు. మంగళవారం మండల కేంద్రమైన అడ్డతీగలకు వారపు సంత నిమిత్తం వచ్చే చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో స్థానిక సీతపల్లి సెంటర్ వద్ద అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐ నరసింహమూర్తి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో సెల్ఫోన్ వాడకం ఎక్కువగా ఉండటం వల్ల ఆన్లైన్ మోసాలు సైబర్ నేరాలు అధికమవుతున్నాయని వాటిపట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని స్పష్టం చేశారు. అలాగే గంజాయి వంటి మాదకద్రవ్యాలకు ఏజెన్సీ యువత దూరంగా ఉండాలని వాటికి బానిసలు అయితే జీవితాలు చిన్నా భిన్నం అవుతాయని కుటుంబాలు రోడ్డున పడతాయని హెచ్చరించారు. అలాగే నిత్యం ప్రయాణాలలో రహదారి భద్రతా నియమాలు తప్పక పాటించాలని ద్విచక్ర వాహనదారులు రికార్డులు సక్రమంగా కలిగి హెల్మెట్ వాడకం తప్పనిసరిగా ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు పరిమితికి మించిన వేగాన్ని నియంత్రించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడ్డతీగల పోలీస్ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు

# పారిశుద్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

**– జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్**





**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పురపాలక సంఘం లో పారిశుద్యంపై మున్సిపల్ అధికారులు, సంబంధిత సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని, కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ సూచించారు. మంగళవారం పెద్దాపురం పట్టణంలోని స్పెషల్ శానిటేషన్ పనులను పరిశీలించి అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే పట్టణాలలో పారిశుద్యం మెరుగుపడేందుకు చర్యలు తీసుకోవాలని, మున్సిపాలిటీలో మైక్రో శానిటేషన్‌పై దృష్టి పెట్టాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దీనిలో భాగంగా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ పలు వార్డులలో సుడిగాలి పర్యటన చేపట్టారు. అలాగే పట్టణాలలో పలు హోటల్స్, వార్డులలో చేపడుతున్న శానిటేషన్ పనులను స్వయంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట కాకినాడ మున్సిపల్ కార్పోరేషన్ కమీషనర్ ఎన్.వి.వి.సత్యనారాయణ, పెద్దాపురం మున్సిపల్ కమీషనర్ శ్రీకాంత్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆదినారాయణ ఉన్నారు.

# అంగన్వాడీలపై ప్రభుత్వ తీరును నిరసిస్తూ రాజవొమ్మంగిలో నిరసన కార్యక్రమం



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** అంగన్వాడీలపై ప్రభుత్వ తీరును నిరసిస్తూ మండల కేంద్రమైన రాజవొమ్మంగిలో సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడి కార్యకర్తలు హెల్పర్లు మంగళవారం, ర్యాలీ, నిరసన కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర రాజధానిలో తమ సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా ఆందోళనలు చేస్తున్న అంగన్వాడీలపై ప్రభుత్వ ఆదేశాలు మేరకు పోలీసులు అత్యంత దారుణంగా తెల్లవారుజామున 4 గంటలకు అంగన్వాడీల పై అవలంబించిన వైఖరిని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలలో భాగంగా సిఐటియు నాయకులు రామరాజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో తొలిత ర్యాలీ నిర్వహించి,స్థానిక అల్లూరి కూడలివద్ద మానవహారం, పోలీసుస్టేషన్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పి రామరాజు,మండల కన్వీనర్ టి శ్రీను, తదితరులు నాయకులు మాట్లాడుతూ తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లిన అంగన్వాడి కార్యకర్తలు ఆందోళన కొనసాగిస్తున్న నేపధ్యంలో అంగన్వాడీ యూనియన్ నేతలతో కూటమి ప్రభుత్వ యంత్రాంగం ఒక వైపు చర్చలు కొనసాగిస్తూనే మంగళవారం తెల్లవారుజామున పోలీసులతో పెద్ద ఎత్తున్న శిబిరంలోకి బలవంతంగా వెళ్లి వేలాది మందిని మూకుమ్మడిగా అరెస్టులు చేసి,టెంట్ కూల్చేసి,లైట్లు ఆపేసి మహిళలని చూడకుండా విచక్షణారహితంగా, బలవంతంగా ఈడ్చుకుంటూ అక్రమంగా బస్సుల్లోకి ఎక్కించారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న బిడ్డలతో చంకన ఎత్తుకుని ఈ కార్యక్రమంలో పాల్గొన్న అంగన్వాడీలను,తల్లి బిడ్డల తొ సహా అరెస్ట్ చేశారని తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని,రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, నిత్యావసర సరుకులు ధరలకు అనుగుణంగా అంగన్వాడీ ల వేతనం లేకుండా వారి వేతనం మాత్రం రూ 11.500 దగ్గరే ఆగిపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడగడం అంగన్వాడి వర్కర్ల సమస్యలు పరిష్కరించక పోగా వారిపై దాడులు చేయడం సరి కాదన్నారు. గత వైసీపీ ప్రభుత్వం లో 42 రోజుల చేసిన సమ్మెలో భాగంగా ఇదే తీరులో అక్రమ అరెస్టు లు చేసినప్పుడు కూటమి ప్రభుత్వం కల్లబొల్లి మాటలు చెప్పి ప్రతిపక్షంలో ఉన్న కూటమి పెద్దలు ఈ రోజు అక్రమ అరెస్టులు చేయడం చాలా దుర్మార్గమని అన్నారు. గతం లో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కూడా అంగన్వాడి లు పై నిరంకుశ వైఖరి అవలంబించడంతో వైసీపీ ప్రభుత్వం ఈ రోజు అడ్రస్ లేకుండా పోయిందని,గతంలో 10 సంవత్సరాలు అంగన్వాడి లు దెబ్బకి అధికారానికి దూరంగా ఉన్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు చంద్రబాబు ప్రభుత్వం గుర్తు పెట్టుకోవాలని ముఖ్యమంత్రి,ఉప ముఖ్యమంత్రి చంద్రబాబు,పవన్ కళ్యాణ్‌లకు విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకొని అరెస్ట్ చేసిన నాయకత్వాన్ని విడుదల చేసి గత ప్రభుత్వంలో ఒప్పందం చేసుకున్న హామీలు తో బాటు,కనీస వేతనం పై నిర్ణయం తీసుకొని జీతాలు పెంచేలా కృషి చేయాలని డిమాండ్ చేశారు.

ఈ నిరసన కార్యక్రమానికి ఎంపీపీ గోము వెంకటలక్ష్మి,మాజీ సర్పంచ్ కనిగిరి దుర్గాప్రసాద్ భవన నిర్మాణ కార్మికులు తమ మద్దతు తెలిపారు. అనంతరం వాళ్ళు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్థానిక ఎస్సై శివకుమార్ కు అందించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్ల, హెల్పర్ యూనియన్ నాయకులు రాజేశ్వరి, రాధ వీరయమ్మ,మంగ, కుమారి,వీరలక్ష్మి,లక్ష్మీ పొన్నాలు,పెద్ద సంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

## ఇంటి పన్నుల వసూళ్ళుపై ప్రత్యేక దృష్టి సారించాలి – ఎంపీడీవో





పెద్దాపురం రూరల్,మేజర్ న్యూస్ : పెద్దాపురం మండలం పరిధిలోని అన్ని పంచాయతీలలో ఇంటి పన్నుల వసూళ్ళను పంచాయతీ సెక్రటరీలు, సిబ్బంది, త్వరితగతిన ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు వసూలు చేయాలని ఎంపీడీఓ తెలిపారు. దీనిలో భాగంగా మంగళవారం మండలంలో కాండ్రకోట, మర్లవ, తూర్పు పాకలు గ్రామాలలో ఇంటి పన్నుల వసూళ్ళతీరునుఎంపిడిఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన తెలుపుతూ పన్నుల వసూళ్ళలో పంచాయతీ సెక్రటరీలు నిర్లక్ష్యం వహించరాదని, అలాగే శానిటేషన్, డోర్ టు డోర్ చెత్త సేకరణ వంటి వాటిపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. దీనిలో ఇంటి పన్నుల వసూళ్ళ తీరుతో పాటు శానిటేషన్, ఎస్.డబ్ల్యు.పి.షెడ్ల నిర్వహణ, ఇంటింటి చెత్త సేకరణ వంటివాటిపై ఆయన పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ సెక్రటరీలు, భషీర్, హేమశ్రీ, రామతులసి, పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఎన్ఎఫ్‌డిపీ కార్డులు చేపిస్తున్న మత్స్యకార చైర్మన్ పెద్దిరాజు



**నర్సాపురం,మేజర్‌న్యూస్ :** రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కార్యాలయం వద్ద నేషనల్ ఫిషరీస్ డిజిటల్ ప్లాట్‌ఫారం కార్డులను మంగళవారం కార్పొరే షన్ చైర్మన్ కొల్లు పెద్ది రాజు చేయించారు.

ఈ కార్డులు మత్స్యకారుల సంక్షేమం,డిజిటల్ సేవలను అందించడానికి భారత ప్రభుత్వం 'నేషనల్ ఫిషరీస్ డిజిటల్ ప్లాట్‌ఫారమ్'ను ప్రారంభించిందని దీని ద్వారా మత్స్యకారులకు,ఆక్వా రైతులకు డిజిటల్ పరిజ్ఞానం,బీమా,ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందన్నారు. ఈ స్కీంను కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా ఈ ప్లాట్‌ఫారమ్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చు, లాభాలు పీఎం-ఎంకెఎస్‌ఎస్వై పథకం కింద క్రెడిట్, ఇన్సూరెన్స్, ఇతర ప్రోత్సాహకాలు పొందవచ్చునని పెద్దిరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి కొప్పాడి నరేష్, కొల్లాటి శ్రీనివాసు, కొప్పాడి అనంత్, సంఘాని సూర్యభగవాన్ రాజు, మల్లాడి బాలు,మల్లాడి శ్రీను, పోతాబత్తుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## 16 మద్యం సీసాలు స్వాధీనం, వ్యక్తి అరెస్టు

– ఎస్సై చినబాబు



**రాజవొమ్మంగి,మేజర్‌న్యూస్ :** మండలంలోని జడ్డంగి స్టేషన్ పరిధిలోని కొండలింగపర్తి గ్రామ శివారులో నిర్వహించిన తనిఖీలలో ప్రభాకర్ అనే వ్యక్తి వద్ద నుండి 16 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చినబాబు తెలిపారు.

ఆయనపై ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేయబడిందని అక్రమ మద్యం విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అయన హెచ్చరించారు.

## రాష్ట్ర కన్వీనర్‌గా ఎమ్మెల్యే నల్లమిల్లి నియామకం



అనపర్తి, మేజర్ న్యూస్ : కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కన్వీనర్‌గా అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నియమితులైనట్లు భారతీయ జనతా పార్టీ జాతీయ అధిష్టానం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఈనెల 7వ తేదీన ఢిల్లీలోని బిజెపి జాతీయ కార్యాలయంలో, జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అధ్యక్షతన జరగనున్న సమావేశానికి హాజరు కావలసిందిగా ఎమ్మెల్యే నల్లమిల్లిని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ఆహ్వానించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఐదుగురు సభ్యులతో కూడిన ఈ కమిటీలో కన్వీనర్‌గా నల్లమిల్లి బాధ్యతలు నిర్వర్తించనున్నారు. జాతీయ బిజెపి సూచించే ప్రతి కార్యక్రమాన్ని క్రమబద్ధంగా అమలు చేస్తూ వస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి పనితీరుపై పార్టీ అధిష్టానం సంతృప్తి వ్యక్తం చేస్తోంది. ఇప్పటికే పార్టీలో కీలక బాధ్యతలు నిర్వహించిన ఆయనకు ఇప్పుడు జాతీయ స్థాయి కమిటీల్లో స్థానం కల్పించడం విశేషంగా భావిస్తున్నారు. ఎమ్మెల్యే నల్లమిల్లికి సముచిత స్థానం కల్పించినందుకు బిజెపి నాయకులు కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## కాలువలో పడి మహిళ మృతి



**అనపర్తి, మేజర్ న్యూస్ :** అనపర్తి గ్రామంలోని శేషయ్య నగర్‌లో నివాసం ఉంటున్న పడాల పుష్పవతి (75) అను ఆమె ఎర్ర కాలవలో పడి మృతి చెందింది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం పడాల పుష్పవతి గత కొంతకాలంగా గర్భాశయ క్యాన్సర్‌తో బాధ పడుతూ కాకినాడ జిజిహెచ్‌లో వైద్యం చేయించుకుంటుంది. భర్త చనిపోయినప్పటి నుంచి శేషయ్య నగర్ లో తన సొంత ఇంట్లో నివాసం ఉంటుంది. వెంకట రామకృష్ణారెడ్డి తల్లికి ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో ఇంటికి వెళ్లి ఆరా తీయగా బయటికి వెళుతున్నాను అని చెప్పి వెళ్లిపోయినదని ఇంటిపై ఫిర్యాదు చేసి వెతుకుతుండగా మంగళవారం సాయంత్రం నాలుగున్నర గంటల సమయంలో అనపర్తి కొత్తూరు శివారు కైలాస భూమి ఎదురుగా ఉన్న ఎర్ర కాలువలో శవమై కనిపించినట్లు తెలిసింది. ఇందుపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## 23కు చేరిన బాణాసంచా ప్రమాద మృతులు




సామర్లకోట, మేజర్ న్యూస్ : వేట్లపాలెం బాణాసంచా తయారీ కేంద్రంలో సంభవించిన పేలుడు ఘటనలో మృతుల సంఖ్య 23 కు చేరింది. కాకినాడ జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న వేమగిరి లోవరాజు(38), మధ్యాహ్నం 2:33 గంటలకు మృతి చెందారు. ఇంకా ఒక వ్యక్తి పరిస్థితి విషమంగా ఉందని, మిగిలిన 5గురి ప్రస్తుత పరిస్థితి నిలకడగా ఉన్నట్లు జిజిహెచ్ సూపరిండెంట్ ప్రకటించారు. కాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చెందిన ముగ్గురు కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన పరిహారం విడుదలకు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించినట్టు తహసిల్దార్ కే.చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

## ఆదమరిస్తే అంతే సంగతులు

**చాట్రాయి, మేజర్ న్యూస్** మండలంలోని చీపురుగూడెం వద్ద ఉన్న ప్రమాదకరమైన మలుపు వద్ద ఆదమరిస్తే అంతే సంగతులు అన్న మాదిరిగా ఉంది. చీపురుగూడెం నుండి కోటపాడు వచ్చే మార్గంలో ఇరువైపులా ఉన్న మలుపులో చెరువు వద్ద ఎటువంటి ప్రమాద హెచ్చరికలు లేకపోవడం, చెరువు కోతకు గురి కావటం ప్రమాదాలను తెచ్చి పెట్టే విధంగా ఉంది. ఈ మలుపు వద్ద ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా వాహనాలు చెరువులోకి దూసుకు వెళ్లే అవకాశం ఎక్కువగా ఉంది.

# గల్ఫ్ దేశాల్లో ఉన్న ప్రవాస ఆంధ్రులతో వీడియో కాల్ మాట్లాడి ధైర్యం చెప్పిన మంత్రి సుభాష్





**– ఏపీ ఎన్‌ఆర్‌టిసి హెల్ప్‌లైన్ ద్వారా పూర్తి సహాయం అందిస్తామని భరోసా**

**రామచంద్రపురం, మేజర్‌న్యూస్ :** గల్ఫ్ దేశాల్లో నెలకొన్న యుద్ధ వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రవాస ఆంధ్రులతో వీడియో కాల్ ద్వారా మాట్లాడి వారి పరిస్థితులను తెలుసు కున్నారు. ఇజ్రాయిల్ – ఇరాన్ దేశాల మధ్య యుద్ధ వాతావరణం కారణం గా నెలకొన్న పరిస్థితులు,ఆయా దేశాల్లో చిక్కుకున్న తెలుగు వారిని క్షేమంగా రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ వారికి భరోసా కల్పించారు. యుద్ధ వాతావరణం కారణంగా కొన్ని విమానాశ్రయాలలో ప్రయాణీకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎన్.ఆర్.ఐ. సాధికారత వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, తాను ఎప్పటికప్పుడు పరిస్థితి పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. అక్కడ పనిచేస్తున్న కార్మికులకు ధైర్యం చెబుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ మీ వెంటే ఉంటుందని భరోసా ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ప్రవాస ఆంధ్రుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయం అందించేందుకు ాఅస్త్రతీుాతీుసవంష్ట్ర చీశీఅ– =వంఱసవత్ ఎవశ్రీబస్త్రబ ాశీఒఱవ్ఎ (ూాచీ=ూ) ఈమెయిల్: ష్త్రవశ్రీజూశ్రీఱఅవమ్ఖుజూఅతీం.ఒశీఎలకు, 24/7 హెల్ప్ లైన్, ం918500027678 వాట్సాప్ ద్వారా సమాచారం అందించవచ్చు నన్నారు. గల్ఫ్ దేశాల్లో ఉన్న ఆంధ్రులందరూ ఆందోళన చెందకుండా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించారు.ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లిన ప్రతి కార్మికుడి భద్రత రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమని మంత్రి స్పష్టం చేశారు. అవసరమైతే కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇరుదేశాల మధ్య త్వరలోనేశాంతి నెలకొని సాధారణ పరిస్థితులు ఏర్పడాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న కార్మికుల ప్రతినిధి బొంతు నాగరాజు సంక్షోభ సమయంలో తమతో ప్రత్యక్షంగా మాట్లాడి ధైర్యం చెప్పినందుకు ప్రత్యేకంగా అభినందించారు. మస్కెట్ నుంచి బొంతు నాగరాజు, కట్టా నాగమల్లేశ్వరరావు, కువైట్ నుండి కట్టా భాస్కర్ అధ్యక్షులు బీసీ చైతన్య వేదిక గల్ఫ్ వ్యవస్థాపకలు, గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవాసంస్థ, దుబాయ్ నుండి కడలి వెంకటకృష్ణ, ఖూజు శెట్టిబలిజ ఐక్యసంఘం, ఖాతార్ నుండి పితాని సత్యనారాయణ (సత్యమూర్తి), బెహరిన్ నుంచి చింతపల్లి లక్ష్మీనారాయణ, సౌదీనుండి పితాని రాంబాబు తదితరులు మంత్రి సుభాష్‌తో వీడియో కాల్ ద్వారా అక్కడి పరిస్థితులు వివరించారు. కార్మికుల పట్ల మంత్రి సుభాష్‌కున్న చిత్తశుద్ధిని ప్రస్తుతించి కృతజ్ఞతలు తెలియజేశారు.



# జీడి మామిడి తోట అగ్నికి ఆహుతి

**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** జె.కొత్తూరు పంచాయతీ పరిధిలో ఉన్న తిరుపతిరాజుపేట గ్రామంలో ఎకరంన్నర జీడి, మామిడి తోట అగ్నికి ఆహుతి అయ్యాయి. గ్రామానికి చెందిన బాధిత రైతు కొండపల్లి రాజు తెలిపిన వివరాల ప్రకారం జె.కొత్తూరు గ్రామానికి చెందిన కొండపల్లి సత్యవతి 50 సెంట్లు, సిరిమల్లె వీరబాబు 50 సెంట్లు, వత్తాడ అర్జున్న 50 సెంట్లు సీలింగ్ భూమిని గత మూడు దశాబ్దాల క్రితం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో డి పట్టాల పంపిణీ చేశారు. ఈ భూమిలో సంబంధించిన రైతులు జీడి, మామిడి తోటలు పెంచుకుంటూ జీవనాధారం సాగిస్తున్నారు. ఏమైందో ఏమో కానీ సోమవారం రాత్రి సమయంలో అనుమానాస్పదంగా జీడి, మామిడి మొక్కల తోటల నుంచి మంటలు వ్యాపించి ఎకరంన్నర తోటలో దగ్ధమయ్యాయి. కాపు కొచ్చిన తోటలు బుగ్గి పాలవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేస్తామని బాధిత రైతులు తెలిపారు. ప్రభుత్వ పరంగా ముగ్గురు రైతులను ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# కూటమి అరెస్టులపై అంగన్వాడీల ఉగ్రరూపం

**– కనీస వేతనం రూ.26 వేలు ఇచ్చేవరకు పోరాటం – సిఐటియు**

**– చర్చలకు పిలిచి అరెస్టు చేయడం సిగ్గుచేటని విమర్శ**

**కాకినాడ/సామర్లకోట, మేజర్ న్యూస్ :** వేతనాలు పెంచాలని కోరుతూ అంగన్వాడీలు చేస్తున్న శాంతియుత ఆందోళనపై కూటమి ప్రభుత్వం పోలీసులను ప్రయోగించి మంగళవారం తెల్లవారుజాము నిద్రలో ఉన్న అంగన్వాడీల నాయకులను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో కచేరిపేట సుందరయ్య భవన్ నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం లాకుల వద్ద రహదారి దిగ్బంధనం చేసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు దడాల పద్మ, సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వ శేషబాబ్జి మాట్లాడుతూ, శాంతియుత ఆందోళన చేస్తున్న అంగన్వాడీలను చర్చలకు పిలిచి అర్ధాంతరంగా తెల్లవారుజామున అరెస్టులు చేయడాన్ని ఖండించారు. ఎన్నికల ముందు వేతనాలు పెంచుతామని చెప్పిన చంద్రబాబు నిజస్వరూపం బయటపడిందని విమర్శించారు. 2019 నుండి వేతనాలు పెంచలేదని, ఈ ఏడేళ్లలో పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం అంగన్వాడీలకు 26 వేలు చెల్లించేంత వరకు పోరాటాన్ని ఆపేదే లేదని హెచ్చరించారు. అంగన్వాడీ




మహిళలపై దుస్సాసనుడిలా విరుచుకుపడి బస్సులలో వందల కిలోమీటర్లు తిప్పుతూ, కనీసం కాలకృత్యాలు కూడా అవకాశం ఇవ్వకుండా అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. అరెస్టు చేసిన నాయకత్వాన్ని తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీల నిరసనకు ఐద్వా రాష్ట్ర నాయకురాలు సిహెచ్.రమణి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు టేకుముడి ఈశ్వరరావు, రిటైరు పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.సత్తిరాజు మద్దతు తెలిపారు.

## 141 బెటాలియన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులు, అగర్ బత్తిల తయారీపై శిక్షణ



**ఎటపాక, మేజర్ న్యూస్ :** పోలవరం జిల్లా ఎటపాక మండలం పిచ్చుకలపాడు గ్రామంలో సిఆర్‌పిఎఫ్ 141 బెటాలియన్ వారి సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా సిఆర్పిఎఫ్ కమాండెండ్ రితీష్ కుమార్ ఆదేశాల మేరకు ఇన్స్పెక్టర్ చందు శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం మహిళలకు కొవ్వొత్తులు, అగర్ బత్తిలతయారీపై శిక్షణ కార్యక్ర మాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా చందు శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ శిక్షణ యొక్క ముఖ్య ఉద్దేశ్యం అతి తక్కువ పెట్టుబడితో ఇంట్లోనే ఉండి తయారీ చేయవచ్చు అని, దాంతో ఉపాధి పొందవచ్చు అని ఆయన అన్నారు. సిఆర్‌పిఎఫ్ కేవలం భద్రతే కాకుండా సంక్షే మం,ఆర్థిక అభివృద్ధి కోసం ఇలాంటి సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలను నిరంతరంనిర్వహించడం జరుగుతుంది అని ఆయన తెలిపారు.

## ఇటిసి నందు మెస్ నిర్వహణకు టెండర్లు ఆహ్వానం

**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం డివిజన్ సామర్లకోట మండల పరిధిలో గల సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రంలో మెస్ నిర్వహణకు సీల్డ్ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ఇటిసి ప్రిన్సిపల్ కె.ఎన్.వి.ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా 2026–27 ఆర్థిక సంవత్సరంలో వివిధ జిల్లాల నుంచి శిక్షణకు వచ్చేవారికి మెనూ ప్రకారం భోజనాలు, అల్పాహారాలు సరఫరా చేసే ఆశక్తి ఉన్న నిర్వాహకులు ధరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సామర్లకోట శిక్షణా కేంద్రంలో ఈ నెల 5 నుంచి టెండరు ధరఖాస్తులు జారీ చేయబడతాయని, ఈ నెల 23లోగా సమర్పించవలసి ఉంటుందని ప్రిన్సిపల్ తెలిపారు. ఈ నెల 25న సీల్డ్ టెండర్లు తెరిచి నిబంధనల మేరకు సరఫరాదారును ఖరారు చేయడం జరుగుతుందని ప్రిన్సిపల్ పేర్కొన్నారు. కావున అర్హత గల ఆశక్తి గల టెండరు దారులు పాల్గొనాలని సూచించారు. మరిన్ని వివరాలకు కార్యాలయ పనివేళల యందు సంప్రదించాలని సూచించారు.

## మిస్సింగ్ కేసు ఛేదించిన పోలీసులు

**– మైనర్ బాలికను తల్లిదండ్రులకు అప్పగింత**



**బిక్కవోలు, మేజర్ న్యూస్ :** మండలంలోని, బల బద్రపురం గ్రామానికి చెందిన మల్లిడి సత్యనారాయణ రెడ్డి తన కుమార్తె మల్లిడి విహారికా రెడ్డి బలబద్రపురం గ్రామంలో తొమ్మిదో తరగతి చదువుతున్నట్లు మరియు సెల్ఫోన్లో ఎక్కువసేపు చాటింగ్ చేస్తున్నందున తల్లిదండ్రులు మల్లిడి సత్యనారాయణ రెడ్డి మందలించి సుమారు నెల రోజుల నుండి స్కూలుకి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉండి చదివిస్తుండగా సోమవారం ఉదయం 11 గంటల నుండి రెండు గంటల మధ్యలో తల్లిదండ్రులు రాజమహేంద్రవరం పని నిమిత్తం వెళ్లి ఇంటికి వచ్చి చూసుకునే ఇంటి వద్ద లేనందున, ఎంత వెతికిన ఆచూకీలు లభ్యం కాకపోవడంతో బిక్కవోలు పోలీస్ స్టేషన్‌లో తండ్రి మల్లిడి సత్యనారాయణ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు పై బిక్కవోలు పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు.ఈ కేసు విషయమై బిక్కవోలు పోలీసులు ఉన్నతాధికారులకు సమాచారం అందించగా తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ వారి ఆదేశాలపై అనపర్తి సీఐ వి ఎల్ వి కే సుమంత్ వారి యొక్క సర్కిల్ స్టేషన్లో నుండి రంగంపేట ఎస్సై శివ ప్రసాద్, బిక్కవోలు ఎస్సై వి .రవిచంద్ర కుమార్ మొత్తం మూడు టీములుగా ఏర్పడి సాంకేతిక పరిజ్ఞానం మరియు స్థానిక బలబద్రపురం గ్రామస్తులు ఇచ్చిన సమాచారంపై దర్యాప్తు మొదలుపెట్టి కేసు నమోదైన కొన్ని గంటల వ్యవధిలోనే తప్పి పోయిన అమ్మాయి మల్లిడి నిహారికా రెడ్డి ఆచూకీ తెలుసుకొని, తల్లిదండ్రులకు సమాచారం అందించి విశాఖ పట్నంలో ఉన్న అమ్మాయిని తీసుకుని వచ్చి వారి తల్లిదండ్రులకు సురక్షితముగా అప్పగించారు. కేసు నమోదైన ఐదు గంటల వ్యవధిలోని పోలీసులు, ఉన్నతాధికారులు చాకచక్యంగా వ్యవహరించి, కేసును ఛేదించి అమ్మాయిని తల్లిదండ్రులకు అప్పగించడంపై అమ్మాయి తల్లిదండ్రులు పోలీసుల పనితీరుపై హర్షం వ్యక్తం చేశారు.